క్లుప్తంగా

దేవరగట్టు ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 3,89,440 వచ్చినట్లు గురువారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి దర్శనానికి వచ్చిన భక్తులు హుండీలో వేసిన కానుకలను నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన కమిటీ సభ్యులు గురువారం లెక్కించారు. హుండీలో దాదాపు 2 నెలలకు సంబంధించి కానుకలున్నట్లు చెప్పారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో హుల్తిలింగేశ్వర, కారుమంచేశ్వర స్వాములు

పత్తికొండ(తుగ్గలి) : మండలంలోని పెద్దహుల్తి గ్రామంలో వెలసిన హుల్తి లింగేశ్వర, కారుమంచేశ్వర స్వాములు బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మందపూజ, గంగ పూజ, చివరిరోజు స్వామి కాలి ఆట, ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఏటా కార్తీక మాసం ఆరంభంలో జరిగే ఈ ఉత్సవాలను గ్రామస్తులు, నిర్వాహకులు వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

మద్దమాంబకు ప్రత్యేక అలంకరణ



కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు

మద్దికెర : స్థానిక మద్దమాంబ దేవాలయంలో అమ్మవారిని శుక్రవారం దీపావళి పండుగ పురస్కరించుకొని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళ హారతి, అష్టోత్తరనామార్చన, నైవేద్యం వంటి తదితర పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఎరువుల అమ్మకాల నిలిపివేత

పత్తికొండ(తుగ్గలి) : నకిలీ ఎరువు విక్రయంపై ఓ రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలో ఓ ఫర్టిలైజర్ దుకాణాన్ని వ్యవసాయశాఖ అధికారి వెంకటరాముడు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల స్టాక్‌ను పరిశీలించారు. దుకాణంలో రూ.5.53 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దుకాణదారులు స్టాకు, ధరల వివరాలను ప్రతిరోజు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయశాఖ అధికారులు సూచించిన విత్తనాలనే రైతులు ఎంపిక చేసుకోవాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మితే సమాచారం ఇవ్వాలని రైతులను కోరారు. ఏఈవో రియాజ్ బాషా ఉన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): సర్వమతాల సారాంశం శాంతి, సమానత్వమే అని ఎమ్మిగనూరు మండలం గుడికల్ దర్గా పీఠాధిపతులు గాజా హుసేన్‌పీరా, హమీద్ స్వామి ప్రబోధించారు. స్థానిక అల్లీపీరా స్వామి భజన మందిరంలో రెండు రోజులుగా సద్గురు హుసేన్‌పీరా స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సేవలో పాల్గొన్నారు. గురువారం గంధోత్సం చేపట్టగా..శుక్రవారం ఆరాధనోత్సవాల్లో భాగంగా శిష్య బృందానికి భక్తి ప్రవచనాలను వినిపించారు. నిర్వహకులు, గురు కమిటీ సభ్యులు మేఘనాథరెడ్డి, నారామణ, ఓమేంద్రబాబు, కామేశ్వరయ్య, శాంతమ్మ భక్తులకు అన్నదానం చేశారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

దేవనకొండ: కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా నాయకులు నరసారావు పేర్కొన్నారు. గురువారం ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో దేవనకొండ క్రాస్ రోడ్డు వద్దనున్న కార్యాలయం ఎదుట ఆటో యూనియన్ నాయకులు వేడుకలు చేపట్టారు. రాజశేఖర్, బడేసాబ్, లక్ష్మన్నస్వామి, వీరేష్, రమాంజనేయులు, రామంజి పాల్గొన్నారు.

ఆ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ(తుగ్గలి) : అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని జై భీం యువత ఫౌండేషన్ అధ్యక్షుడు ఆవుల సోమన్న కోరారు. శుక్రవారం ఆయన ఆర్డీవో ఎస్.భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఫీజుల దోపిడీతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారని విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కంది పైనే ఆశలు

- పెరిగిన కంది పంట సాగు విస్తీర్ణం
- పప్పు శనగ, వేరుశనగకు బదులుగా సాగు
- పంట మార్పిడి దిశగా రైతులు



పూతదశలో కంది పైరు

మద్దికెర: ఏటా ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ తదితర పంటలు కలిసి రాలేదని రైతులు ఈ ఏడాది అధికంగా కంది పంట సాగుచేశారు. మండలంలో 12,473 ఎకరాల్లో కంది పంట వేశారు. గత నాలుగేళ్లుగా వేరుశనగ పంట కలిసి రాకపోవడంతో కంది పంట వైపు మళ్లారు. ముందస్తు వర్షాలు కురవడంతో ఎన్నో ఆశలతో పంట వేశారు. పంట ఏపుగా పెరిగింది. దిగుబడి బాగా వస్తుందని కొంతైనా అప్పులు తీర్చుకుందామనే ఆశతో ఉన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వేసిన పంటలన్నీ నష్టాలు మి గిల్చాయని, కంది పంట బాగుండటంతో ఇదైనా ఆదుకుంటుందని కర్షకులు ఆశతో ఉన్నారు. అలాగే మార్కెట్‌లో ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో కొంతమేర గట్టెక్కవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత నెలరోజులుగా అడపాదడపా వానలు వస్తుండడంతో పైరు బాగా పెరిగింది.

ఆస్పరి: మండలంలో కంది సాగు విస్తీర్ణం పెరిగింది. 40 ఏళ్లుగా రబీ సీజన్‌లో నల్లరేగడి పొలాల్లో పప్పు శనగ సాగు చేసి విసిగిపోయిన రైతులు కంది పంటపై ఆసక్తి చూపుతున్నారు. పప్పు శనగకు ఎకరాకు రూ. 20వేల పెట్టుబడి వస్తుండటం, దిగుబడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఏటా నష్టాలు చవిచూసేవారు. గత ఏడాది నుంచి ఆస్పరి, చిన్నహోతూరు, జొహరాపురం గ్రామాల రైతులు కంది పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. గత ఏడాది 4,600 ఎకరాల్లో కంది సాగు చేయగా, ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 15,080 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. ఇందులో చిన్నహోతూరు గ్రామ రైతులు ఎక్కువగా సాగు చేశారు. చిన్నహోతూరులో మొత్తం 12 వేల ఎకరాలు ఉండగా ఈ సంవత్సరం 7,500 ఎకరాల్లో కంది పంట వేశారు. జొహరాపురంలో 3,900 ఎకరాలు, ఆస్పరిలో 2,100 ఎకరాల్లో సాగు చేశారు. కంది పంట సాగుకు ఎకరాకు రూ. 10 వేలు పెట్టుబడి వస్తుండటం, పైగా కూలీలు, కోత, నూర్పిడికి కూడా ఎక్కువ కష్టం లేకపోవడంతో రెండేళ్ల నుంచి అన్నదాతలు కంది పంట వైపు మొగ్గు చూపుతున్నారు.

పెట్టుబడి, శ్రమ తక్కువ



నాకున్న 20 ఎకరాల్లో 10 ఏళ్ల నుంచి పప్పు శనగనే సాగు చేశాం. శనగ పంటలకు కూలీలు, స్ప్రే మందులు విత్తనాలు కలిపి ఎకరాకు రూ.20వేలు పెట్టుబడి అయ్యేది. ఎకరాకు 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా మార్కెట్లో క్వింటా ధర రూ.4నుంచి రూ.5వేలు పలికేది. ఈ పంట గిట్టుబాటు కావడం లేదని గత ఏడాది ఎకరాకు రూ.10వేలు పెట్టుబడితో 5 ఎకరాల్లో కంది పంట సాగు చేశా. గత ఏడాది వర్షాలు సరిగా లేకపోవడంతో ఎకరాకు 2 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. క్వింటా ధర రూ.10 వేల ప్రకారం అమ్ముకున్నా. పెట్టుబడి పోగా.. రూ.50 వేలు మిగిలింది. దీంతో ఈ ఏడాది 6 ఎకరాల్లో కంది పంట సాగు చేశా.ప్రస్తుతం పంటను చూస్తుంటే.. ఎకరాకు 4–6 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– మధుసూదన్‌రెడ్డి, రైతు, ఆస్పరి

6 ఎకరాల్లో సాగు చేశా



ఈ సంవత్సరం రూ.60 వేల పెట్టుబడితో ఆరెకరాల్లో కంది పంట వేశా. మాకు నల్లరేగడి పొలాలు ఉన్నందున ఎక్కువగా పప్పు శనగ సాగు చేసేవాళ్లం. ప్రతి సంవత్సరం వర్షాలు రాక, వర్షాలు అధికంగా వచ్చినా పంట చేతికి వచ్చేది కాదు. ఏటా ఏదోఒక విధంగా నష్టపోయేవాళ్లం. పంట మార్పిడి చేయకపోవడం వల్ల దిగుబడి కూడా తక్కువగా వచ్చేది. మా గ్రామంలో ఎక్కువ మంది రైతులు కంది పంట సాగు చేశారు. నూర్పిడి తరువాత వచ్చే కంది పొట్టు పశవులకు దాణాగా ఉపయోగ పడుతుంది.

– మహానంది, రైతు, చిన్నహోతూరు

పంట మార్పిడి తప్పనిసరి



పంట మార్పిడి చేస్తేనే మంచిది. పంట మార్పిడి చేయడం వల్ల శత్రువు పురుగుల శాతం తక్కువై, మిత్ర పురుగులు పెరుగుతాయి. భూమి సారవంతమతుంది. పంట మార్పిడి వల్ల మొక్క పోషక పదార్థాలను సమతుల్యంగా ఉపయోగించుకుంటుంది. చిన్నహోతూరులో ఎక్కువ మంది రైతులు కంది పంట సాగు చేశారు. కంది పంటకు పురుగులు ఆశించకుండా రైతులు మందులు పిచికారీ చేయాలి. కంది పంటను ప్రస్తుతం ఆకుచుట్టు పురుగు, మరవక మచ్చల పురుగు ఆశిస్తోంది. దీని నివారణకు ఒక లీటరు నీటిలో 2ఎంఎల్ క్లోరీపైరిపాస్ లేదా క్యూనాల్ పాస్ పిచికారీ చేయాలి.

– నరేంద్రకుమార్, ఏఓ, ఆస్పరి

ఎన్నో ఆశలు పెంచుకున్నాం



మూడు ఎకరాలలో కంది పంటను సాగు చేశా. పంట బాగానే పెరిగింది. దిగుబడి ఏమాత్రం వస్తుందోనని ఆందోళనగా ఉంది. కంది పంట అయినా అప్పులు తీర్చుతుందని ఆశగా ఉంది. ఏమి జరుగుతుందో చూడాలి.

– నాగరాజు, మద్దికెర

నేటి నుంచి కార్తీక మహోత్సవాలు

పత్తికొండ(తుగ్గలి): నియోజకవర్గంలోని శివాలయాల్లో శనివారం నుంచి కార్తీక మాస మహోత్సవ వేడుకలు ప్రారంభం కానున్నాయి. పత్తికొండ మండలంలోని మండగిరిలో వెలసిన పురాతన రామలింగేశ్వస్వామి ఆలయంతో పాటు పట్టణంలోని పలు ఆలయాల్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శివలింగానికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, మంగళహారతి, నీరాజనం, మంత్ర పుష్ప ఆశీర్వచనంతో పాటు, దీ పాలతో అలంకరణ ఉంటుందని పూజారులు తెలిపారు.

కోటకొండలో ప్రత్యేక పూజలు

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలోని రాంబావి రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ, పరమేశ్వరులకు శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివార్లకు పంచామృతాభిషేకం, జలాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు చేపట్టారు. భక్తుల సమక్షంలో అఖండ జ్యోతి వెలిగించారు. కొలుట్ల చెన్నకేశవస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి, రామలింగడు, కర్రెస్వాములు, శ్రీను, హరి పాల్గొన్నారు.

మద్దికెర : మండలంలోని శివాలయాల్లో శనివారం నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. మండల కేంద్రానికి 3 కి.మీ దూరంలోనున్న బుగ్గసంగమేశ్వరంలో 2,4,11,18,25 వ తేదీల్లో కార్తీక సోమవారాలు నిర్వహిస్తామని, అలాగే 15వ తేదీ కార్తీక పౌర్ణమి దీపోత్సవం ఉంటుందని చెప్పారు.



మీటే తండాలో దీపాలతో ఇంటింటికీ తిరుగుతున్న బాలికలు



కృష్ణగిరిలో బాణాలు కాల్చుతున్న చిన్నారులు



దేవరగట్టులో పూజలందుకుంటున్న మాళ మల్లేశ్వరస్వామి

ఊరూరా దీపావళి సంబరాలు

పత్తికొండ(తుగ్గలి) : కోటి కాంతుల దీపావళి పండుగను పట్టణ ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లు, వాణిజ్య సముదాయాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో లక్ష్మీ పూజ చేశారు. చిన్నాపెద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కర్నూలులో, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతులు, పోచిమిరెడ్డి సేవాదల్ అధ్యక్షుడు మురళీధరరెడ్డి కుటుంబ సభ్యులు పత్తికొండలో పండుగ జరుపుకున్నారు.

తుగ్గలిలో..

మండలంలో దీపావళిని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లలో లక్ష్మీదేవి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల్లో నివసించే తండావాసులు తండాలకు రావడంతో సందడిగా మారాయి. బాలికలు కొత్త దుస్తులు ధరించి ధరించి దీపాలు చేతపట్టుకుని ఇంటింటికీ తిరిగి పెద్దల ఆశీర్వాదం పొందారు. పిల్లా పాపలతో కలిసి బాణసంచా కాల్చారు.

కృష్ణగిరి: కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లోని పల్లెల్లో గురువారం దీపావళి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇంట్లో లక్ష్మీదేవికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా బాణాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు.



పూజలందుకున్న గాయత్రీ మాత



బాణాసంచా కాల్చుతున్న దృశ్యం

హొళగుంద: మండలంలో గురు, శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి.రెండు రోజులు పాటు జరుగిన వేడుకల్లో దుకాణాలు, ఇళ్లల్లో లక్ష్మి పూజ నిర్వహించారు. అలాగే.. అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని దేవరగట్టు, హొళగుంద సిద్దేశ్వరస్వామి తదతర ఆలయాలతో పాటు ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేశారు.

ఆస్పరి: మండలంలోని గ్రామాల్లో గురువారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆస్పరిలోని జనార్థన స్వామి, మారెమ్మ, కన్యకా పరమేశ్వరీ, రామతీర్థంలో వెలసిన రామలింగేశ్వర స్వామి, గాయత్రీ మాత, జొహరాపురం గ్రామంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లోపూజలు నిర్వహించారు. ఆలయాల్లో దీపాలంకరణతో నూతన శోభ చేకూరింది. పండుగ సందర్భంగా ఇళ్ల ముందు దీపాలను వెలగించారు. పల్లెల్లో టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

ఆలూరు: దీపావళి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో గురు, శుక్రవారం రెండు రోజుల పాటు వేడుకలను నిర్వహించారు. శుక్రవారం వ్యాపారులు, కుటుంబ స భ్యులు పెద్ద ఎత్తున బాణ సంచారనాన్ని కాల్చి సంబంరాలను జరుపుకున్నారు. హిందీప్రేమ మందిరం ఆవరణంలో తేనేటి విందు ఏర్పాటు చేశారు.

పింఛన్ కష్టాలు

- మొరాయించిన సర్వర్
- పింఛన్ పంపిణీలో అంతరాయం



హొళగుందలో సచివాలయం వద్ద పింఛన్ కోసం ఎండలో ఎదురుచూస్తున్న నాగమ్మ



జి. మల్లాపురంలో పింఛన్ కోసం కట్ట వద్ద వృద్ధుల పడిగాపులు

చిప్పగిరి: పింఛన్ల పంపిణీ శుక్రవారం మండలంలోని 9 గ్రామ సచివాలయాల పరిధిలోని 16 గ్రామాల్లో గ్రామ సచివాలయ సిబ్బంది ఉదయం ప్రారంభించారు. ప్రారంభం నుంచి సర్వర్ మొరాయించడంతో పంపిణీలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో చాలా గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల దగ్గరకి వెళ్లకుండా కాలనీల్లో ఒక స్థలంలో కూర్చొని పంపిణీ చేశారు. మండలంలో 3,464 మంది వివిద రకాల పింఛన్‌దారులు ఉన్నారు.

హాలహర్వి: మండలంలో శుక్రవారం పింఛన్ల పంపిణీకి సర్వర్ మొరాయించడంతో పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారు. ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేసేందుకు సచివాలయ అధికారులు ఏర్పాట్లు చేసుకున్నా సర్వర్ మొరాయించడంతో వెనుదిరిగారు. దీంతో పింఛన్‌దారులు సచివాలయాల వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంట తర్వాత సర్వర్ పనిచేయడంతో కొందరు మాత్రమే పింఛన్లు పొందారు. విరుపాపురం, సుళువాయి, గూళ్యం, బల్గోట, అర్ధగేరి తదితర గ్రామాల్లోని సచివాలయాల వద్ద పింఛన్ కోసం గంటల తరబడి పింఛన్‌దారులు ఎదురు చూడాల్సి వచ్చింది.

హొళగుంద: సర్వర్ సమస్యతో పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయం సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీ చేసేందుకు వెళ్లగా మధ్యాహ్నం వరకు సర్వర్ సమస్య నెలకొంది. పింఛన్లు ఇచ్చే విషయంలో ఆలస్యం కావడంతో కొందరు లబ్ధిదారులు సచివాలయాల వద్దకు వచ్చి ఎదురు చూడసాగారు. మధ్యాహ్నం నుంచి సర్వర్ సక్రమంగా పనిచేయడంతో మండలంలో మొత్తం 5,975 పింఛన్లకు గాను 5,646 పింఛన్లను పంపిణీ చేసి 95 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ విజయలలిత తెలిపారు.

కృష్ణగిరి: శుక్రవారం పింఛన్ల పంపిణీలో ఉదయం సర్వర్ పని చేయకపోవడంతో పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో అయా గ్రామాల్లో పింఛన్‌దారులు సమీపంలోని సచివాలయాలు, రచ్చకట్టల వద్ద ఎదురుచూశారు. రెండు గంటల తరువాత సర్వర్ పనిచేయడంతో పంపిణీని యథావిధిగా కొనసాగించారు. రాత్రి 7 గంటలకు మండలంలో 95శాతం మందికి పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు.

తడి, పొడి చెత్త సేకరించాలి

ఆస్పరి: గ్రామాలలో తడి,పొడి చెత్తను సేకరించి ఎరువు తయారు చేయాలని ఎంపీడీఓ గీతావాణి, పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్‌కు డీపీఓ భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలించారు.

ఆలూరు: జిల్లాలోని మేజర్, మైనర్ గ్రామపంచాయతీల్లో చెత్త, చెదారంతో ప్రజలు అంటురోగాల బారిన పడితే అందుకు సంబంధిత ఈఓ, పీఎస్‌లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వారపు కూరగాయల మార్కెట్, కర్నూల్,బళ్లారి రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప, ఆలూరు సర్పంచ్ అరుణాదేవి,ఈఓ ప్రభాకర్ ఉన్నారు.



ఆస్పరిలో అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీఓ భాస్కర్

జయప్రదం చేయండి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈ నెల 12, 13 తేదీల్లో ఆదోనిలో జరిగే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 30వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సోమన్న పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన వెల్దుర్తిలోని మహాసభలకు సంబంధించిన కరపత్రాలను కళాశాల విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. జిల్లా సమితి సభ్యులు అశోక్, మధు, సుధీర్, వెల్దుర్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రయాదవ్, సదానంద్, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.





హొళగుందలో నెలకొరిగిన వరి పైరు,హెబ్బటంలో దెబ్బతిన్న వరిపంటను చూపుతున్న రైతు వెంకటేశ్

దెబ్బతీసిన వర్షం

హొళగుంద: మండల కేంద్రంతో పాటు హెబ్బంట, గజ్జహళ్లి, వందవాగిలి తదితర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వందలాది ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) కింద సాగు ప్రస్తుతం పంట చేతికందే దశలో ఉంది. కురిసిన గాలి,వానకు పైరు వాలిపోయి గింజలు నేల పాలయ్యాయి. ఎకరాకు దాదాపు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశామని, పైరు నెలకొరగడం వల్ల గింజలు రాలి దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే అతివృష్టి వల్ల మెట్టభూములోని పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులు, ఎల్లెల్సీ కింద సాగు చేసిన వరి పంటపై ఆశలు పెట్టుకున్నారు. అయితే దిగుబడి చేతికొచ్చే సమయంలో వర్షం దెబ్బతీయంపై ఆందోళన చెందుతున్నారు.

మోసపూరిత వాగ్దానాలతో జనాన్ని నమ్మించారు

- హామీల అమలులో చంద్రబాబు విఫలం
- ప్రభుత్వ సహకారం అందక ప్రజల అవస్థలు
- ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

హొళగుంద: చంద్రబాబునాయుడు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేశారని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. గురువారం హొళగుందలో కార్యకర్తల సమావేశం జరిగింది. అంతకు ముందు ఆయన స్థానిక సిద్దేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ వివిధ పథకాల కింద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.2.70 లక్షల కోట్లను ప్రజలు ఖాతాల్లో జమ చేశాన్నారు. టీడీపీ ఇచ్చిన హామీలు ఎక్కడ అమలువుతున్నాయని ప్రశ్నించారు. వలంటీర్లకు రూ.10 వేల జీతం, రైతు భరోసా కింద రూ.20 వేలు ఇస్తానన్న హామీలు ఏమయ్యాయన్నారు. ప్రస్తుతం అన్ని వస్తువుల ధరలు పెరిగాయని, కరెంట్ చార్జీలు పెరుగుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఎంపీటీసీ మల్లికార్జున, నాయకులు ఎస్కే గిరి, కోగిలతోట శేషప్ప, వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మంజునాయక్, హనుమప్ప, నాగిరెడ్డి, శేక్షావలి, సిద్దయ్య, శంకర్, చంద్ర, రంగస్వామి, శంభులింగ, రమేష్, హెబ్బటం శ్రీనివాసరెడ్డి, నాగభూషన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



హాలహర్విలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

కూటమి ప్రభుత్వ అరాచకాలపై పోరాడదాం

హాలహర్వి: కూటమి ప్రభుత్వ అరాచకాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోరాడాలని ఎమ్మెల్యే బి.విరూపాక్షి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక క్షేత్రగుడి దేవాలయంలో మండలస్థాయి నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన నిలబడి టీడీపీ కూటమి ప్రభుత్వ అరాచకాలను అడ్డుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు కాలయాపన చేస్తున్నాడన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి, పార్టీ రాష్ట్ర కో కార్యదర్శి జనార్ధన్‌నాయుడు, ఎంపీపీ నెట్టికంటమ్మ, వైస్ ఎంపీపీ నగేష్, కో–కన్వీనర్ మల్లికార్జున, మండల యూత్ అధ్యక్షుడు గంగాధర, సీనియర్ నాయకులు తిప్పారెడ్డి, అర్ధగేరి శ్రీనివాసులు, పరశురామ్, గోపాల్, లింగప్ప, కృష్ణ, రామయ్య, సుంకన్న, శేఖన్న, దిబ్బలింగ పాల్గొన్నారు.

వంట నిర్వాహకుల పోటాపోటీ

మద్దికెర : మా ప్రభుత్వం వచ్చింది మేమే వంట చేస్తాం.. మీరు వెళ్లిపోండి అంటూ మరో గ్రూపు వారు హుకుం జారీ చేసి న సంఘటన స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జరిగింది. ఓంసాయి గ్రూపు వారు 18 ఏళ్లుగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండుతున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ సానుభూతిపరులు ప్రీతి గ్రూపు వారు తామే వంట చేస్తాం అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వంట చేసేందుకు అవసరమైన సామగ్రిని పాఠశాలలో తెచ్చిపెట్టారు. ప్రధానోపాధ్యాయుడు అజరయ్యబాబును వివరణ కోరగా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చేంత వరకు ఎవరిని మార్చమని చెప్పారు.

ఘనంగా అల్లావలి ఉరుసు

హొళగుంద: దేవరగట్టులో వెలసిన హజరత్ అల్లావలి సాహెబ్ 20వ ఉరుసు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు చేశారు.

రోల్ మోడల్‌గా పత్తికొండ



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

పత్తికొండ (ఆళ్లగడ్డ): రాష్ట్రంలో పత్తికొండ గ్రామ పంచాయతీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, పత్తికొండ గ్రామ పంచాయతీ గౌరవ సలహాదారు నాగరత్నమ్మ అన్నారు. సర్పంచ్ కొమ్ము దీపిక అధ్యక్షతన శుక్రవారం గ్రామంలోని పార్వతికొండ వీధిలో శివాలయం దగ్గర రూ.8 లక్షలతో నూతనంగా నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని పత్తికొండ పురోభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ సర్పంచ్ కళావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు ఉన్నారు.

